గల్లీకో గంజాయి అడ్డా

• విస్తరిస్తున్న విష సంస్కృతి • నిలువరించలేక పోతున్న పోలీస్ యంత్రాంగం

ఉప్పల్: ఉప్పల్, దాని పరిసర ప్రాంతాల్లో నిత్యం యువత మత్తులో మునిగి తేలుతోంది. దమ్ మారో రోదం.. అంటూ మత్తులో మునిగి తెలుతున్నారు. మత్తులో మునిగి తేలే వారు ఎక్కువగా కళాశాల విద్యార్థులే కావడం ఆందోళన కలిగించే అంశం. చిన్న చిన్న ఏజ్ గ్రూపు పిల్లలు సైతం మత్తు బారిన పడి చిత్తవుతున్నారు. మాదక ద్రవ్యాల వినియోగం రోజు రోజుకూ పెరిగిపోతోంది. యువతే టార్గెట్‌గా గంజాయి సరఫరా జరుగుతోంది. ముఖ్యంగా డిగ్రీ, ఇంజనీరింగ్ విదార్థులే కాకుండా ఇంటర్ స్థాయి విద్యార్థులు కూడా మత్తు పదార్థాలకు బానిసవుతున్నారు. ఉప్పల్ ప్రాంతం అన్నింటికీ జంక్షన్ కావడంతో ఈ ప్రాంతంలో హాస్టల్స్ పుట్టగొడుగుల్లా విస్తరించాయి. దీనికి ముఖ్య కారణం ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ఇంజనీరింగ్ కళాశాలు, ఉండటం వారంతా అక్కడ చదువుతూ ఇక్కడ హాస్టల్స్ లో ఉంటున్నారు. దీంతో వేలాది మంది యువతీ యువకులు ఉప్పల్ పరిసర ప్రాంతంలో ఉండటం వల్ల గంజాయి విక్రేతలు బాగా కలిసి వచ్చింది.



ఉప్పల్‌ను టార్గెట్ చేసుకున్నారు.

ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు డివిజన్లు ఉన్నాయి. ఉప్పల్, చిలుకానగర్, రామంతాపూర్, హబ్సిగూడ. హబ్సిగూడ కొంత భాగం ఓయూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంటుంది. చిలుకానగర్, మల్లికార్జున్ నగర్, ఎస్సీ కమ్యూనిటి హాల్ పక్కన గల నిర్జన ప్రాంతం, నాచారం చెరువు కట్ట, వెంకటరెడ్డినగర్, కేసీఆర్‌నగర్,కేటిఆర్ నగర్, మూసి పరివాహక ప్రాంతాలు, ఉప్పల్ దేవేందర్‌నగర్, లక్ష్మీనారాయణ కాలనీలు బస్తీలు కావడం, చుట్టూ పారిశ్రామిక వాడలు విస్తరించి ఉండటంతో మత్తు పదార్థాలు విక్రయానికి, సేవించడానికి అనుకూల ప్రాంతాలుగా మారాయి. వీటితో ఉప్పల్ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన భగాయత్ లేఅవుట్‌లో కూడా ఇదే పరిస్థితి. ఎవ్వరైనా పోలీసులకు సమాచారం ఇచ్చినా, వారిని నిలువరించే ప్రయత్నం చేసినా వారిపై దాడులకు తెగపడుతున్నారు. పోలీసులు వచ్చే లోపుగా పరార్ అవుతున్నారు. దీంతో సమాచారం ఇవ్వడానికి స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు జంకుతున్నారు. ఇక ఈ ప్రాంతాల్లో పార్టీలు, పండుగలు వస్తే గంజాయి మూకలు మరింత రెచ్చి పోతుంటాయి. పోలీసుల ఎదుటే దాడులకు పాల్పడిన సంఘటనలు న్నాయి. అధికారులు అప్రమత్తమై సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాల మూలాలను సమూలంగా నాశనం చేయాలని కోరుతున్నారు.

కఠినంగా వ్యవహరిస్తున్నాం

గంజాయి లాంటి మాదక ద్రవ్యాలను విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట పెట్రోలింగ్‌ను పెంచాం. సమస్య ఉన్న ప్రాంతాల్లో వాహనాల తనిఖీలను ముమ్మరం చేసాం. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి వారి ద్వారా విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నాం. కాలనీల్లో, బస్తీల్లో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం. వీటితో కాలనీల్లో బస్తీల్లో కొత్త వారు కనిపిస్తే 100 కు డైల్ చేసి సమాచారం ఇవ్వాలి. విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

–మన్మధరావు, ఉప్పల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్

విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ రూరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణలను ఆవిష్కరించి సమాజానికి సహకాం అందించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం కేంబ్రిడ్జ్ ఇంగ్లీష్ ఎంపవర్ సీ1 లెవల్, సిస్కో సీ సర్టిఫికేషన్ అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు అవార్డులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

నీట్ సిగ్నేచర్ క్యాంపెయిన్



క్యాంపెయిన్‌లో విద్యార్థులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

మేడ్చల్: రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా జిల్లా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మేడ్చల్ లోని వివిధ కళాశాల్లో నీట్ సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు.కళాశాలల్లో విద్యార్థులు సంతకాలు చేసి ఎన్ఎస్‌యూఐ చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమానికి మద్దతు పలికారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌యాదవ్ నాయకులు రాకేష్, శ్రీధర్,వరుణ్‌రెడ్డి,శశి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్, కౌన్సిలర్

మేడ్చల్: పట్టణంలోని బాలాజీనగర్, చంద్రనగర్‌లలో రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె నిర్మాణ పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. పట్టణంలోని అన్ని కాలనీలలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ నాగిరెడ్డి,కాలనీల వాసులు పాల్గొన్నారు.

మూత్రశాలలు నిర్మించాలి



మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కోసం వేర్వేరుగా మూత్రశాలలు నిర్మించాలని, మరమ్మత్తులు చేయించాలని పట్టణ బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలను బీజేపీ నాయకుల బృందం పరిశీలించి సమస్యలను కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ కార్యాలయంలో ఆయనతో సమావేశమై పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ప్రేందాస్, శ్రీకాంత్, రాజు, అవినాష్, మహేష్ తదితరులు ఉన్నారు.

పార్క్ చేసిన ఆటో మాయం

ఘట్‌కేసర్: ఇంటి ముందు నిలిపిన ఆటోను గుర్తు తెలియని దుండగులు మాయం చేశారు. ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపిన మేరకు.. బొక్కొనిగూడకు చెందిన బచ్చు మహేశ్ తన ప్యాసింజర్‌ను ఆటోను మంగళవారం మధ్యాహ్నం ఇంటి ముందు నిలిపి లోపలికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం 5 గంటల ప్రాంతంలో ఇంటి నుండి బయటకు వచ్చి చూడగా తన ఆటో కనిపించలేదు. చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకి లభించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మేడ్చల్‌లో రక్తదాన శిబిరం



వసతి గృహంలో విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: పిల్లలకు సోకే సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని గిరిజన బాలుర వసతి గృహంలో సికిల్ సెల్ అనీమియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖా ప్రత్యేకాధికారి సదా మాలోత్ , డీటీడీఓ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



బత్తిని శ్రీకాంత్ (ఫైల్)

ఘట్‌కేసర్: విధుల కోసం వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ సైదులు తెలిపిన మేరకు.. ఎదులాబాద్‌కు చెందిన బత్తిని శ్రీకాంత్ (28) శనివారం మధ్యాహ్నం ఘట్‌కేసర్‌లోని తన కార్యాలయానికి వెళుతున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపి ఇంటి నుండి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకి లభించకపోవడంతో అతడి తల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

మేడ్చల్: ఏఐసీసీ అగ్రనేత ఎంపీ రాహుల్ గాంధీ పుట్టిన రోజును మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో కాంగ్రెస్ జెండా వద్ద నాయకులు తమ నాయకుడి పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్,సురెందర్ ముదిరాజ్, రాహుల్‌యాదవ్, లాయక్ అలీ, కౌడే మహేష్, మధుకర్‌యాదవ్,లింగం ,నాగభూషణం, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో, ఘనాపూర్ పవర్ గ్రిడ్ వద్ద స్థానిక అధ్యక్షుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ హాజరై కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.



ఘట్‌కేసర్‌లో కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, ముత్యాలు, రాధాకష్ణ

23న ఉచిత వైద్య శిబిరం

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బిల్డింగ్ ఆవరణంలో 23 వ తేదీ ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని గణపతి మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కోఆపరేటవ్ క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు భరత్,మాధవరావులు తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీఎం ఫోటో ఏర్పాటు చేయాలి

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్ వార్డు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చిత్రపటాలను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం కాంగ్రెస్ పార్టీ డివిజన్ నేతలు వార్డు కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య, అంజిరెడ్డి, జలగం వెంకటేష్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతికోత్సవం

గౌతంనగర్: నగరంలోని తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో బుధవారం సర్వకళ కళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో సాంస్కృతికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాట్య గురువు, కళారత్న డాక్టర్ ఎస్‌పీ. భారతిని సభాధ్యక్షులు సారిపల్లి కొండల్‌రావు సత్కరించారు. అనంతరం సర్వకళ కళాకారుల సంక్షేమ వేదికకు ఎస్‌పి.భారతి ఆర్థిక సహాయం అందచేశారు.

బైక్‌ను కారుతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు

ఘట్‌కేసర్: బైక్‌ను కారుతో ఢీకొట్టిన వ్యక్తిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై శేఖర్ తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం పెద్దగూడెం గ్రామానికి చెందిన బి మనీశ్ మంగళవారం రాత్రి బైక్‌పై ఘట్‌కేసర్‌కు బయలుదేరాడు. ఎదులాబాద్-ఎంకిర్యాల్ చౌరస్తాకు చేరుకోగానే ఓ కారు వ్యతిరేక దిశలో వేగంగా నడుపుతూ మనీశ్ బైక్‌ను ఢీకొట్టగా అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. బాధితుడి తల్లి ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బోడుప్పల్: సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ అన్నారు. డివిజన్ పరిధిలో బుధవారం పర్యటించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాటర్ మరమ్మతుల పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నానని, ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు వెలుగొండయ్య, సూర్యప్రకాశ్‌రెడ్డి, కృష్ణమాచారి, బాలాజీ హిల్స్ ఫేస్ 3 కాలనీ అధ్యక్షులు నాగరాజ కుమార్ పాల్గొన్నారు.

కంకర రోడ్డుతో ఇబ్బందులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఎన్ఎఫ్‌సీనగర్ బీ2 కాలనీలో రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు నెలల కిందట కంకరను రోడ్డుపై పరిచి అలాగే వదిలేయడంతో ద్విచక్ర వాహనాల టైర్లు పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సందర్భంగా రోడ్డు పనులు నిలిపివేశారని, ఎన్నికల పూర్తి అయినా పనులు తిరిగి ప్రారంభించడం లేదన్నారు. దీంతో రోడ్డుపై పరిచిన కంకరతో ఇంటి నుండి అడుగు బయటపెట్టలేదని దుస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీ2 కాలనీ రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



విశిష్ట ప్రొఫెసర్ల నియామకం

శామీర్‌పేట్: సమాజంలో గొప్ప సేవలు అందిస్తున్న మేధావులను విశ్వవిద్యాలయ స్థాయిలో విద్యాపరమైన సేవలు వినియోగించుకుంటే యూనివర్సిటీ విద్యార్థులకు మరింత ఉపయోగపడుతాయని నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ శ్రీ కృష్ణ దేవరాయులు అన్నారు. నల్సార్ యూనివర్సిటీ విశిష్ట ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణగాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మేగ్‌సెసే అవార్డు గ్రహీత పి. సాయినాథ్‌లను నియమించినట్లు బుధవారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించండి

మేడ్చల్: పట్టణంలోని మూడవ వార్డులోని బ్రాడ్ వే కాలనీలో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకటప్రేందాస్ కమిషనర్ నాగిరెడ్డిని కోరారు. బ్రాడ్ వే కాలనీలో మంచినీరు సరఫరా చేయడానికి పైపులైన్ లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బడ్జెట్ కేటాయించి పైపులైన్ నిర్మాణం చేయాలని ఆయన కోరారు.

బండి సంజయ్‌కు పలువురి శుభాకాంక్షలు



శామీర్‌పేట్: కేంద్ర హోం సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బండి సంజయ్ రాష్ట్రానికి తొలిసారిగా వచ్చారు. నగరం నుండి కరీంనగర్ వెళ్తున్న బండి సంజయ్ అల్పాహారం కొరకు శామీర్‌పేట మండలం, మురహారి పల్లిలోని బృందావన్ రెస్టారెంట్ వద్ద ఆగారు. ఈ క్రమంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ వసుపతి ప్రణితాగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 9వ వార్డు వాయి శక్తినగర్ కాలనీలో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. అందరి సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధిబాటలో ముందుకు తీసుకెళతామన్నారు. టీపీసీసీ ప్రధానకార్యదర్శి, 9వ వార్డు కౌన్సిలర్ గోగుల సురితావెంకటేష్ పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో సమస్యలను పరిష్కరిస్తాం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం మేయర్ శాంతి ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ప్రగతి పనుల్లో వేగం పెంచి, సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. జవహర్‌నగర్‌లో సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్స్, బోరు మోటార్లు, భూగర్భ డ్రైనేజీలకు బడ్జెట్ ప్రవేశపెట్టగా కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, మేనేజర్ ప్రభాకర్‌యాదవ్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, జలమండలి మేనేజర్ కౌశిక, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యుత్ ఏఈ ఎర్రన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ శాంతి

ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్



ప్రయాణికులతో మాట్లాడుతున్న మేనేజర్ కవిత

ఘట్‌కేసర్: రద్దీ సమయాల్లో ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగులు సంయమనం పాటించాలని, ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెంగిచెర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. ప్రమాదాల నివారణకు పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులు, విద్యార్థులు బస్సులు ఎక్కేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. బస్సులో సీటు పొందే క్రమంలో మూల మలుపుల వద్ద కదులుతున్న బస్సుల్లో ఎక్కరాదని, బస్సులు ఆగిన తర్వాతే ఎక్కడం గాని దిగడంకాని చేయాలన్నారు. కార్యక్రమంలో మియాపూర్ డిపో మేనేజర్ వెంకటేశం, ఎస్‌డీఐ అక్బర్, ప్రయాణికులు పాల్గొన్నారు.

వ్యక్తిగత నైపుణ్యంతో ఉపాధి అవకాశాలు పుష్కలం



కేపీఆర్ఐటీ కళాశాలలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న డైరెక్టర్ దివ్యశ్రీ, మధుసూదన్

ఘట్‌కేసర్: వ్యక్తిగత నైపుణ్యం, బేసిక్స్‌తో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని గ్రాడియస్ టెక్నాలజీస్ కంపెనీ కోఫౌండర్ మధుసూదన్ అన్నారు. ఘనాపూర్ కొమ్మూరి ప్రతాపరెడ్డి అటనామస్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థుల నైపుణ్యం అభివృద్ధి, ఉపాధి కొరకు ఆ కళాశాల డైరెక్టర్ దివ్యశ్రీతో గ్రాడియస్ టెక్నాలజీస్ కంపెనీ బుధవారం ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు మార్కులు ప్రామాణికం కావని, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అల్వాల్: కొకూర్ భరత్‌నగర్ కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. కాలనీలో సీసీ రోడ్డు వేయించాలని, డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని, కొకూర్ బస్టాండ్ నుండి భరత్‌నగర్ వరకు రోడ్డు వేయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి వెంటనే సంబంధిత అధికారులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కొకూర్, భరత్‌నగర్ వాసులు తిరుపతిరావు, సత్యనారాయణ, సందీప్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ దస్తావేజులు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్: నకిలీ దస్తావేజులు సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మూడో వార్డు కౌన్సిలర్ సంగీత ప్రభాకర్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ జగన్ మోహన్ రాజుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీలోని దత్తాత్రేయ నగర్ కాలనీలో ఓ ముఠా నకిలీ దస్తావేజులు తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజులపై అధికారులు నిఘా పెట్టాలని కోరారు.

తుమ్మ చెరువులో చెత్త తొలగింపు

మేడ్చల్: పట్టణంలోని తుమ్మ చెరువులో చెత్తను తొలగించే కార్యక్రమానికి మున్సిపల్ అధికారులు శ్రీకారం చుట్టారు. చెరువులో నీరు కిందకు చేరడంతో కట్టవైపు ఉన్న చెత్తను జేసీబీ సహాయంతో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, చెరువులో ఇష్టానుసారంగా పారేయడంతో కట్ట వెంబడి పూర్తిగా పేరుకుపోయి దుర్వాసనలు వెదజల్లడంతో అధికారులు తొలగింపు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వేసవి దృష్ట్యా చెరువులో నీరు అడుగంటిపోవడంతో చెరువులో పేరుకుపోయిన చెత్తను, ఎండిన చెట్లను తొలగించారు. చెత్త తొలగింపును చైర్ పర్సన్ దీపికనర్సింహా రెడ్డి, కౌన్సిలర్ మర్రి శ్రీనివాస్‌రెడ్డిలు పర్యవేక్షించారు.



తుమ్మ చెరువులో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది



ఉత్సాహంగా యువ క్రీడోత్సవాలు

కీసర: వివిధ క్రీడల్లో యువ అథ్లెటిక్స్, రాణించేందుకు కృషిచేయాలని పల్లవి గ్రూప్ స్కూల్స్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. బుధవారం అహ్మద్ గూడలోగల పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించిన యువ క్రీడోత్సవాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. చదువులతోపాటు, విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

తవ్వి.. ఇలా నిర్లక్ష్యంగా వదిలేశారు





తవ్వి వదిలేసిన కిష్టాపూర్ రోడ్డు

మేడ్చల్ రూరల్: మేడ్చల్- కిష్టాపూర్ రోడ్డులో కేఎల్ఆర్ కమాన్ సమీపంలో రోడ్డుపై మురుగు ప్రవాహం కారణంగా ఏర్పడిన గుంతలకు మరమ్మత్తులు చేసేందుకు రోడ్డును తవ్విన మున్సిపల్ అధికారులు మరమ్మత్తులు మరిచి పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. కేఎల్ఆర్ వెంచర్‌లోని పలు ఇళ్లు, అపార్ట్‌మెంట్ల నుండి మురుగు నీరు కేఎల్ఆర్ కమాన్ గుండా కిష్టాపూర్ వాగు వరకు ప్రవహిస్తోంది. మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ఏర్పడిన గుంతలు ఏర్పడుతున్నాయి. కాగా ఇటీవల సమస్యను పరిశీలించిన మేడ్చల్ మున్సిపల్ కమీషనర్ నాగిరెడ్డి రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని, మురుగు నీరు రోడ్డుపైకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. దీంతో గత 15 రోజుల క్రితం రోడ్డు మరమ్మత్తు పనులు ప్రారంభించిన సిబ్బంది రోడ్డును జేసీబీతో తవ్వి అందులో కంకర వేసి అక్కడితో పనులకు స్వస్తి పలికారు. ఆ రోడ్డు ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం ప్రయాణించే వందలాది వాహనదారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనదారులు గుంతలో ఒక్కసారిగా పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. మరోవైపు వర్షాలు కురిస్తే డ్రైనేజీ నీరు పెద్ద ఎత్తున రోడ్డుపై ప్రవహించి తమకు మరింత ఇబ్బందులు కలుగుతాయని వెంటనే సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.